




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 7 సంచిక : 252

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

గురువారం 15 ఫిబ్రవరి 2024


## చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన జడ్పీటీసీలు, వైసీపీ నేతలు





**అమరావతి,కలంకౌంటర్ :** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైసీపీ నేతలు ఆ పార్టీకి గట్టి షాక్ ఇచ్చారు. వైసీపీకి చెందిన ముగ్గురు జడ్పీటీసీలు, కౌన్సిలర్ సహా పలువురు నేతలు బుధవారం టీడీపీలో చేరారు. ఉండవల్లి నివాసంలోని చంద్రబాబు సమక్షంలో శ్రీకాళహస్తి జడ్పీటీసీ కె.వెంకటసుబ్బారెడ్డి, ఏర్పేడు జడ్పీటీసీ కె.తిరుమలయ్య, తొట్టంబేడు జడ్పీటీసీ పి.అర్చనాదేవి, శ్రీకాళహస్తి 32వ వార్డు కౌన్సిలర్ వి.హరి నాయుడు, తొట్టెంబేడు మాజీ జడ్పీటీసీ పి.వెంకటాచలం టీడీపీలో చేరారు. వీరికి చంద్రబాబు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన జడ్పీటీసీలు మాట్లాడుతూ జడ్పీటీసీలుగా తాము గెలిచామే తప్ప ఒక్క అభివృద్ధి కార్యక్రమమూ చేపట్టలేకపోయామన్నారు. స్థానిక సంస్థలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. వైసీపీలో తమను బానిసలుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తిలో అవినీతి తప్ప అభివృద్ధి జరగడంలేదని వాపోయారు. టీడీపీ హయాంలో నియోజకవర్గంలో పెద్దఎత్తున పరిశ్రమల ఏర్పాటు జరిగిందని, తద్వారా వేల సంఖ్యలో ఉద్యోగాలొచ్చాయని గుర్తు చేశారు. శ్రీకాళహస్తి అభివృద్ధి జరగాలంటే మళ్లీ టీడీపీనే రావాలని వారు ఆకాక్షించారు. పార్టీలో చేరిన వారికి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇంఛార్జ్ బొజ్జల సుధీర్ రెడ్డితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

## పదేళ్లు ఈ ముఖ్యమంత్రి బాధ్యతల్లోనే ఉంటాను: రేవంత్ రెడ్డి

● నిరుద్యోగులు ఎవరూ అధైర్యపడవద్దని... మీ సమస్యలను పరిష్కరిస్తామని సీఎం హామీ ● సీఎంగా ప్రమాణం చేసినప్పుడు ఎంతగా సంతోషించానో... నియామక పత్రాలు ఇస్తున్నప్పుడు అంతే ఆనందం ఉందన్న సీఎం ● ఉద్యోగాలు పొందిన వారి కళ్లలో ఆనందం చూస్తేనే తనకు నిద్రపడుతుందన్న రేవంత్ రెడ్డి ● కంచర గాడిదను ఇంటికి పంపించి రేసు గుర్రాన్ని తెచ్చుకున్నామని ఓ అటెండర్ అన్నారని గుర్తు చేసుకున్న సీఎం



**తెలంగాణ, కలంకౌంటర్ :** పదేళ్లు ఈ ముఖ్యమంత్రి బాధ్యతల్లోనే ఉండి ప్రజల కోసం ఇరవై నాలుగు గంటలు పని చేస్తానని... మీ–రు ఆశీర్వదిస్తేనే మరో పదేళ్ళు ఇందిరమ్మ రాజ్యం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎల్బీ స్టేడియంలో హోంశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్తగా ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాలను ఆయన అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నిరుద్యోగులు ఎవరూ అధైర్యపడవద్దని... మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ కోసం పోరాడిన యువత ఉద్యోగాలను సాధించడం ఆనందంగా ఉందన్నారు. తాను ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసినప్పుడు ఎంతగా సంతోషించానో... ఇప్పుడు అంతే ఆనందం వేస్తోందన్నారు. ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నుంచి యువతను గట్టెక్కిస్తామన్నారు. తెలంగాణ వచ్చాక బాధలు తీరుతాయని నిరుద్యోగులు ఆశించారని... కానీ ఉద్యోగాలను భర్తీ చేయాలని గత ప్రభుత్వానికి పదేళ్ల పాటు ఆలోచన రాలేదని ఆరోపించారు. ఇప్పుడు తాము వచ్చాక అధికారులతో చర్చించి ఉద్యోగాల భర్తీకి ఆటంకాలు తొలగించినట్లు తెలిపారు. నియామక పత్రాలను ఇంటికి పంపించవచ్చు కదా? అని హరీశ్ రావు ప్రశ్నిస్తున్నారని... కానీ ఉద్యోగాలు పొందిన వారి కళ్లలో ఆనందం చూస్తేనే తనకు నిద్రపడుతుందని అందుకే ఇక్కడ ఇస్తున్నట్లు తెలిపారు. మీరంతా మాకు తమ్ముళ్లు... కాబట్టి మీ ఆనందాన్ని మేం పంచుకుంటామన్నారు. కేసీఆర్ తన కుటుంబ సభ్యులకు పదవులు, ఉద్యోగాలు ఇస్తే మేం మాత్రం అందరికీ ఇస్తామన్నారు. కేసీఆర్ శాసన సభకు రమ్మంటే రాలేదని... కానీ నల్గొండ వెళ్లి బీరాలు పలికారని విమర్శించారు. పాలిచ్చే బర్రెను ఇంటికి పంపించి దున్నపోతును తెచ్చుకున్నారని కేసీఆర్ తమను ఉద్దేశించి అంటున్నారని... కానీ అసెంబ్లీలో ఓ అటెండర్ మరో రకంగా చెప్పారని రేవంత్ రెడ్డి అన్నారు. కంచర గాడిదను ఇంటికి పంపించి రేసు గుర్రాన్ని తెచ్చుకున్నామని సదరు అటెండర్ అన్నారని తెలిపారు. యువత కష్టపడి రాష్ట్రాన్ని సాధించుకున్నది... మీ కోసం పని చేయడానికి, మీ సమస్యలు తీర్చడానికి ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పదేళ్లు ఇదే బాధ్యతల్లో ఉండి ఇరవై నాలుగు గంటలు మీకోసం పని చేస్తామని హామీ ఇచ్చారు. మీరు ఆశీర్వదిస్తే పదేళ్లు ఇందిరమ్మ రాజ్యం ఉంటుందన్నారు.

## రాట పాతుట కార్యక్రమంలో హోం మంత్రి






**యర్నగూడెం,కలంకౌంటర్ :** దేవరపల్లి మండలం యర్నగూడెం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం విగ్రహ ప్రతిష్ట పనులకు సంబంధించి రాట పాతుట కార్యక్రమానికి రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బుధవారం ఉదయం యర్నగూడెంలో స్వామి వారి ఆలయం వద్ద రాట పాతుట కార్యక్రమానికి పుట్టింటి ఆడపడుచుగా హోంమంత్రికి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా హోంమంత్రి తానేటి వనిత ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ ప్రాంగణమంతా గోవింద నామస్మరణలతో మారుమ్రోగింది. వెంకటేశ్వర స్వామి కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని హోంమంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తాను పాలుపంచుకోవడం తమ పూర్వ జన్మ సుకృతంగా అభివర్ణించారు. మార్చి 25న వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం జరగనుంది.

## వాలంటీర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల విధులు అప్పగించవద్దు: ఈసీ

**విజయవాడ,కలంకౌంటర్ :** ఏపీలో త్వరలో జరగబోయే ఎన్నికల్లో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పాత్రపై ఎన్నికల సంఘం స్పష్టతనిచ్చింది. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి ఓటర్ల వేలుకు ఇంకు పూసే విధులు మాత్రమే అప్పగించాలని ఈసీ పేర్కొంది. ఇతరత్రా ముఖ్యమైన పనులేవీ వారికి అప్పగించవద్దని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో)కు సూచించింది. ఎన్నికల విధుల కోసం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని తీసుకునేందుకు అభ్యంతరం లేదంటూ సీఈవోకు లేఖ రాసింది. ప్రతి పోలింగ్ పార్టీలోనూ రెగ్యులర్ సచివాలయ సిబ్బందిని నియమించుకోవచ్చని తెలిపింది. బీఎల్వోలుగా పనిచేసిన సిబ్బందిని మాత్రం పోలింగ్ విధుల్లోకి తీసుకోవద్దని స్పష్టం చేసింది. బీఎల్వోలకు పోలింగ్ రోజున ఇతర పనులు అప్పగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని సీఈవోకు సూచించింది. ఇక, వాలంటీర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల ప్రక్రియలో భాగం చేయొద్దని ఈసీ తేల్చి చెప్పింది. వారికి ఎలాంటి ఎన్నికల విధులు కేటాయించవద్దని పేర్కొంది. అభ్యర్థులకు పోలింగ్ ఏజెంట్లుగా కూడా వాలంటీర్లను అనుమతించవద్దని మార్గదర్శకాలు జారీ చేసింది.

## రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటుకు తోడ్పాటు

● 4178 కోట్ల రూ.లతో ఏర్పాటయ్యే పరిశ్రమలకు వర్చువల్ గా శంఖుస్థాపన,ప్రారంభోత్సవం ● ఎపి ఎంఎస్ఎంఇ ఒన్ వెబ్ సైట్ ప్రారంభం ● ర్యాంప్. ప్రారంభం ● ఈజ్ ఆప్ డూయింగ్ బిజినెస్ లో మూడేళ్లుగా దేశంలో ఎపి మొదటి స్థానంలో ఉంది ● సుమారు రూ.20వేల కోట్లతో 4నూతన ఓడరేవులు నిర్మిస్తున్నాం ● ఈనాలుగున్నర ఏళ్లలో 2.5 లక్షల ఎంఎస్ఎంఇ యూనిట్లను రాష్ట్రంలో నెలకొల్పాం ● రాష్ట్ర పరిశ్రమలు,ఐటి శాఖమంత్రి గుడివాడ అమర్నాథ్




**అమరావతి, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం అన్నిరకాలుగా పూర్తి స్థాయి–ంలో సహాయ సహాకారాలను అందిస్తుందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. సుమారు 4వేల 178 కోట్ల రూ.లతో ఏర్పాటు చేస్తున్నబిర్లా గ్రూప్,రిలయెన్స్ ఎనర్జీ, హెల్లా ఇన్‌ఫ్రా, వెసువియస్ ఇండియా లిమిటెడ్, ఏపీఐఐసీ,ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ లకు సంబంధించిన మొత్తం 8 ప్రాజెక్టులను బుధవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుండి ఆయన వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అలాగే ఎపి ఎంఎస్ఎంఇ ఒన్ పేరిట ఏర్పాటు చేసిన ప్రత్యేక వెబ్ సైట్ ను కూడా మంత్రి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం అన్ని విధాలా పూర్తి స్థాయిలో సహాయ సహకారాలను అందిస్తుందని పునరుద్ఘాటించారు.గత మూడేళ్ళుగా దేశంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో ఎపి మొదటి స్థానంలో నిలించిందని అన్నారు. దేశవ్యాప్తంగా 11 పారిశ్రామిక కారిడార్లను ఏర్పాటు చేస్తుండగా ఎపి పరిధిలో విశాఖపట్నం–చెన్నై,చెన్నై–బెంగుళూరు,బెంగుళూరు–హైదరాబాదు పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటవుతున్నాయని మంత్రి అమర్నాథ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 974 కిలోమీటర్ల పొడవైన సముద్ర తీరాన్ని కలిగి ఉందని తీర ప్రాంతం పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనుకూలమని పేర్కొంటూ ఈప్రభుత్వం వచ్చాక సుమారు 20 వేల కోట్ల రూ.లతో నాలుగు ప్రధాన పోర్టులను నిర్మిస్తుండగా రామాయపట్నం పోర్టు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని పరిశ్రమల శాఖ మంత్రి అమర్నాథ్ చెప్పారు. అంతేగాక 10 ఫిషింగ్ హార్బర్లను కూడా ఏర్పాటు చేయడం జరుగుతోందని తెలిపారు. ఈప్రభుత్వం స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పర్చేందుకు ఎంఎస్ఎంఇల ప్రోత్సాహకానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని స్పష్టం చేశారు.దీనిలో భాగంగానే గత నాలుగేళ్ళ కాలంలో 2లక్షల 50 ఎంఎస్ఎంఇ యూనిట్లను రాష్ట్రంలో నెలకొల్పడం జరిగిందని అన్నారు. యువతకు స్థానికంగా మరిన్ని ఉపాధి అవకాశాలను కల్పించేందుకు 26 జిల్లాల్లో 50కి పైగా పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేసేందుకు కృషి జరుగుతోందని వాటికి సంబంధించి ఇప్పటికే డిపిఆర్లు సిద్ధమయ్యాయని మంత్రి అమర్నాథ్ స్పష్టం చేశారు. అంతకు ముందు రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ గ్లోబల్ ఇన్వెస్టుమెంట్ సమ్మిట్ లో అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రక్రియలో భాగంగా పరిశ్రమలు వాణిజ్య శాఖకు సంబంధించి 4వేల 178 కోట్లతో ఏర్పాటవుతున్న8 కెంపెనీలను వర్చువల్ గా శంఖుస్థాపన, ప్రారంభోత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. వాటిలో తిరుపతి జిల్లా నాయుడుపేటలో బిర్లా కార్బన్ ఇండియా ప్రవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 1700 కోట్ల రూ.లతో 250 మందికి ఉపాధి కల్పించే కార్బన్ బ్లాక్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ శంఖుస్థాపన జరుగుతోందన్నారు. అలాగే తిరుపతి జిల్లాలో హెల్లా ఇన్ఫ్రా మార్కెటింగ్ ప్రవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 260 కోట్లతో 400 మందికి ఉపాధి కల్పించే పివిసి పైపులు, పిట్టింగ్స్ యూనిట్,రిలయెన్స్ ఎనర్జీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 8 ప్రాంతాల్లో 1024 కోట్లతో 576 మందికి ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు,అనకాపల్లి జిల్లా పరవాడలో వెసువియస్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో 250 కోట్లతో 500 మందికి ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్నయూనిట్ కు శంఖుస్థాపన చేస్తున్నట్టు చెప్పారు.అదే విధంగా ఎపిఐఐసి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి స్టార్టప్ ఏరియాలో 423 కోట్ల రూ.ల తోను, అనకాపల్లి జిల్లా నక్కపల్లి స్టార్టప్ ఏరియాలో 395 కోట్లతో యూనిట్లు ఏర్పాటు అవుతున్నాయని తెలిపారు.

## ప్రత్యేక హోదా గురించి ఏనాడైనా కేంద్రాన్ని అడిగారా?

● యాత్ర-2లో జగన్ నటిస్తే ఆ సినిమా హిట్టయ్యేదేమో! ● ఉమ్మడి విజయనగరం జిల్లాలో శంఖారావం యాత్ర ● సాలూరు నియోజకవర్గంలో సభ ● జగన్ కు సినిమా పిచ్చి ఎక్కువైంది ● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్





**విజయనగరం,కలంకౌంటర్ :** ఎన్నికల ముందు 25 ఎంపీలు గెలిస్తే ఢిల్లీ మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామని చెప్పిన వైసీపీ ఆ దిశగా కృషి చేసిందా? అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ప్రశ్నించారు. మన్యం జిల్లాలో జరిగిన శంఖారావం సభలో లోకేశ్ మాట్లాడారు. వైసీపీకి 22 మంది లోక్‌సభ, 9 మంది రాజ్యసభ ఎంపీలు ఉన్నప్పటికీ, ప్రత్యేక హోదాపై ఏనాడైనా కేంద్రాన్ని అడిగారా?అని నిలదీశారు. వైసీపీ నాయకులు సామాజిక బస్సు యాత్ర చేస్తున్నారని, అసలు ఆ పార్టీలోనే సామాజిక అన్యాయం జరుగుతోందని విమర్శించారు. ఎన్నికల వేళ సీఎం జగన్ ఇప్పటివరకు 63 మంది ఎమ్మెల్యేలు, 16 మంది ఎంపీలను బదిలీ చేశారన్నారు. వారిలో 90 శాతం మంది బీసీ, ఎస్సీ నాయకులే ఉన్నారని లోకేశ్ ఆరోపించారు.

**జగన్ కు సినిమా పిచ్చి ఎక్కువైంది..** ఉమ్మడి విజయనగరం జిల్లా సాలూరు నియోజకవర్గంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. యాత్ర–2లో జగన్ నటిస్తే ఆ సినిమా కాస్త హిట్టయ్యేదేమో! అని వ్యంగ్యం ప్రదర్శించారు. ఈ మధ్య జగన్ కు సినిమా పిచ్చి ఎక్కువైందని, కానీ ఆ వంకర నవ్వుతో సినిమాల్లో చేయలేదని విమర్శించారు. అయితే తన రేంజి పెంచుకోవడానికి వ్యూహం, యాత్ర–2 సినిమాలు తీశారని లోకేశ్ వెల్లడించారు. మొన్న వచ్చింది యాత్ర–2. అట్టర్ ఫ్లాప్ కన్నా దారుణమైన ఫ్లాప్ అయింది. సొంత పార్టీ వాళ్లే ఇంత దరిద్రగొట్టు సినిమాకు మేం వెళ్లం అంటున్నారు. ఆ సినిమా ఫ్లాప్ కావడంతో నిర్మాత నష్టపోయాడు. జగన్ వద్దకు వెళితే నేనెందుకుం సాయం చేయాలన్నాడు. దాంతో ఆ నిర్మాత అంతిమయాత్ర సినిమా తీస్తానని హెచ్చరించడంతో జగన్ భయపడిపోయి హార్సిలీ హిల్స్ వద్ద రెండెకరాల ప్రభుత్వ భూమిని నిర్మాత పేరున రాయించేశాడు. జగన్ ను నేను అడుగుతున్నా. సినిమా తీసింది మీపై అయినప్పుడు నిర్మాతకు మీ సొంత ఇల్లు రాసిస్తే సరిపోయేది కదా. ఇడుపులపాయలోని వందలాది ఎకరాల్లో రెండెకరాలు ఆ నిర్మాత పేరు మీద రాయొచ్చు కదా" అంటూ నారా లోకేశ్ వ్యాఖ్యానించారు.

**ఆ మూడు కుటుంబాలకు జగన్ లైసెన్స్ ఇచ్చేశాడు..** జగన్ మూడు కుటుంబాలకు లైసెన్స్ ఇచ్చేశాడు. ఒకటి బొత్స కుటుంబం, రెండోది వైవీ సుబ్బారెడ్డి కుటుంబం, మూడోది విజయసాయిరెడ్డి కుటుంబం. ఈ మూడు కుటుంబాలు ఉత్తరాంధ్రను సర్వనాశనం చేస్తున్నాయి. ఎక్కడ ప్రభుత్వ భూమి కనిపించినా, పేదల భూమి కనిపించినా కొట్టేస్తారు. ఈ మూడు కుటుంబాలకు చెందిన వారు చెరువులను కూడా కబ్జా చేస్తారు. అవస రమైతే రాష్ట్ర ప్రభుత్వమే ఆ ఉక్కు ఫ్యాక్టరీని కొనుగోలు చేస్తుందన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో విశాఖకు ఉక్కు పరిశ్రమను తీసుకువస్తే ఈ జగన్ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఎవరూ అధైర్యపడవద్దు. మరో రెండు నెలలు ఓపిక పట్టండి. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వమే ఉక్కు పరిశ్రమను కొనుగోలు చేస్తుంది. ఈ మేరకు ఉత్తరాంధ్ర ప్రజలకు హామీ ఇస్తున్నా. విజయనగరం జిల్లాకు అనేక హామీలు ఇచ్చిన జగన్ ఒక్కటీ నిలబెట్టుకోలేదు. భోగాపురం ఎయిర్ పోర్టు పూర్తి చేస్తానన్నాడు..చేయలేదు. రామతీర్థం ప్రాజెక్టు పూర్తిచేస్తానన్నాడు... చేయలేదు. గోస్తనీ–చంపావతి నదులను అనుసంధానం చేస్తానన్నాడు...చేశాడా. లేదు. రామభద్రాపురం–పెద్దగడ్డ ప్రాజెక్టు పూర్తి చేస్తానన్నాడు. చేయలేదు. పాలేరు నదిపై డ్యామ్ ఏర్పాటు చేస్తానని మాటిచ్చి మాట తప్పాడు ఈ సైకో జగన్ అన్నారు.

**విజయనగరం జిల్లాను అభివృద్ధి చేసింది టీడీపీనే..** విజయనగరం జిల్లాను అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీ. ఎక్కడ చూసినా నాడు టీడీపీ హయాంలో వేసిన రోడ్లు, బ్రిడ్జిలు, పక్కా గృహాలు కనిపిస్తాయి. 2014లో సాలూరులో టీడీపీ గెలవకపోయినా నియోజకవర్గాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశాం. ఈ ప్రాంతాన్ని జాతీయ రహదారులకు అనుసంధానం చేశాం.

**రాజన్నదొర...ఇంకు లేని పెన్ను లాంటోడు!** రాజన్నదొరను ఇక్కడి ప్రజలు నాలుగుసార్లు గెలిపించారు. ఆయన ఇవాళ డిప్యూటీ సీఎంగా కూడా ఉన్నారు. ఒక ఉప ముఖ్యమంత్రి నియోజకవర్గం అంటే ఎలా ఉండాలి...? చిటికేస్తే పనులు అయిపోవాలి! కానీ రాజన్నదొర ఇంకు లేని పెన్ను లాంటోడు. ఆయన పెన్ను అని నేను ఒప్పుకుంటా. కానీ ఇంకు చిన్న శ్రీను దగ్గర ఉంటుంది. ఆయన ఇంకు పోస్తేనే ఈయన పెన్ను రాస్తుంది. సాలూరు నియోజకవర్గం పరిస్థితి ఇలా ఉంటుంది. రాజన్న దొర ఉప ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నా ఇక్కడి ప్రజల జీవితాల్లో ఏమైనా మార్పు వచ్చిందా అని ప్రశ్నిస్తున్నారని లోకేశ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# సైనికులకు యావత్ భారతదేశం ఋణపడి ఉంటుంది

● నగర జనసేన అధ్యక్షుడు నేరేళ్ళ సురేష్



**గుంటూరు,కలంకౌంటర్ :** భారత సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తూ దేశ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతున్న సైనికులకు యావత్ భారతదేశం ఋణపడి ఉంటుందని నగర జనసేన పార్టీ అధ్యక్షుడు నేరేళ్ళ సురేష్ అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థ జైష్ ఏ మహమ్మద్ జరిపిన ఆత్మాహుతి దాడిలో అశువులుబాసిన వీరాజవానులకు బుధవారం ఆయన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జనసేన నేతలు శ్రీనివాసరావుతోటలోని రామనామక్షేత్రం వద్ద నున్న భరతమాత విగ్రహానికి పూలమాలలు వేసి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. నేరేళ్ళ సురేష్ మాట్లాడుతూ పుల్వామా దాడుల్లో మరణించిన ప్రతీ ఒక్కరూ భారతీయుల గుండెల్లో ఎప్పుడూ బ్రతికే ఉంటారన్నారు. ఆ ఘటనలో తీవ్రంగా గాయపడిన 35 మంది జవానులకు ప్రభుత్వం , ప్రజలు అండగా నిలిచారన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే దేశభక్తిని పెంచాల్సిన అవసరం ప్రతీఒక్కరిపై ఉందని నెరేళ్ళసురేశ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి , రాష్ట్ర కార్మిక సంఘ నేత సోమి శంకరరావు , రెల్లి యువనేత ఉదయ్ కుమార్ , పులిగడ్డ గోపి , డివిజన్ అధ్యక్షులు సయ్యద్ షర్ఫుద్దీన్ , కొలసాని బాలకృష్ణ , నందూరి స్వామి ,కోలా


# కలెక్టర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి





**ఒంగోలు,కలంకౌంటర్ :** ప్రకాశం జిల్లాకు నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పి.పరమేశ్వర రెడ్డి బాధ్యతల స్వీకరణ అనంతరం బుధవారం జిల్లా కలెక్టర్ ఏ.ఎస్ దినేష్ కుమార్ ని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పి.పరమేశ్వర రెడ్డి కి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలు, పోలీస్ శాఖ, పరిపాలక అధికార యంత్రాంగం మధ్య సమన్వయము, జిల్లాకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా సమిష్టి కృషి అవసరమని కలెక్టర్ అన్నారు. ఎన్నికల సజావుగా జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లా ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె. నాగేశ్వరరావు ఉన్నారు.

# జనసేన మండల నాయకులతో సమావేశం లో బండి



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జనసేన టిడిపి శ్రేణులు కలిసి పనిచేయాలని బూత్ కన్వీనర్లు ఓటర్ల జాబితా పై పూర్తి అవగాహన కల్పించుకోవాలని ప్రతి ఒక్క ఓటు విలువైనదేనని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం జనసేన టిడిపిపొత్తు ఏర్పరుచుకున్నాయని పొత్తు ధర్మాన్ని పాటిస్తూ జనసేన టిడిపి శ్రేణులు ఐక్యంగా ముందుకు వెళ్లాలని 2024లో జనసేన టిడిపి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోమండలపార్టీఅధ్యక్షుడుగల్లా తిమోతి, సర్పంచ్ బొమ్మసాని నరేష్, జిల్లాఉపాధ్యక్షుడు వంపుగడవలచౌదరి,కార్యదర్శి జన్నునాగరాజు,నగరఅధ్యక్షు లుగడ్డంరాజు, జనసేన పార్టీ నాయకులు మోకారవి బావిరెడ్డిమురళి, బడేవెంకటేశ్వరావు, దారపు రెడ్డి నాగరాజు, యడ్లపల్లిగణేష్, కంచర్లపల్లిసీతయ్య, బ్రహ్మానందం,చిల్లంకుర్తి పిచ్చే శ్వరరావు, కాట్రగడ్డ నాంచారయ్య,అనిల్ బాబు, సాయి,బావిరెడ్డిమురళి,బొమ్మ సానినరేశ్,కర్ర రామకృష్ణ,అడుసుమిల్లి శ్రీనివాస్,పవన్,గణేశ్,గోపి, నూకలసురేష్ బాబు తదితర మండలపార్టీ నాయకులు పాల్గొన్నారు.


# వైసీపీతోనే నా ప్రయాణం..పార్టీ మారే ఆలోచనే లేదు

● నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ●పదేపదే చెబుతున్నా మళ్ళీ చెబుతున్న వైఎస్ఆర్సీపీ అభ్యర్థిగానే పోటీ : ఎంపీ ఆదాల ● పార్టీ మార్పు పై స్పష్టమైన క్లారిటీ ఇచ్చిన ఎంపీ ఆదాల ● సీఎం జగన్ నిర్ణయం మేరకే పోటీ : ఎంపీ ఆదాల● పార్టీ అధిష్టాన నిర్ణయమే శిరోధార్యం : ఎంపీ ఆదాల ప్రభాకర రెడ్డి



**నెల్లూరు,కలంకౌంటర్ :** వివిధ ప్రచార మాధ్యమాలలో, సామాజిక మాధ్యమాలలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి పార్టీ మారుతున్నారనే అసత్య ట్రోల్లింగ్స్ పై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్చార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి ఓ స్పష్టమైన క్లారిటీ ఇచ్చారు. బుధవారం నెల్లూరులోని తన కార్యాలయంలో మీడియాతో ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. తాను ఎట్టి పరిస్థితుల్లోనూ వైస్సార్సీపీని వీడేదిలేదని, నా ప్రయాణం వైసీపీతోనే కొనసాగుతుందని, నెల్లూరు రూరల్ నుండి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో వైస్సార్సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. తాను నెల్లూరు రూరల్ ఇన్చార్జ్ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఒక నూతన డ్రామాకు నాంది పలికి తనపై అసత్య ప్రచారాలను ట్రోల్ చేయడం మొదలుపెట్టారని ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి చెప్పారు. తాను ఇప్పటికే అనేకసార్లు పార్టీ మార్పుపై జరుగుతున్న అసత్య ప్రచారాలను ఖండించడం జరిగిందని, మళ్లీ కూడా చెబుతున్నాను అటువంటి అసత్య ట్రోలింగ్ ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నానని ఎంపీ ఆదాల పేర్కొన్నారు. తాను ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాగుంట శ్రీనివాసరెడ్డిలను కలిసిన మాట వాస్తవమేనని, వారిని పార్టీ విడవద్దని చెప్పిన మాట కూడా వాస్తవమేనని అయితే నిర్ణయం వారికే వదిలిపెట్టామని ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి తెలియజేశారు. తమ పార్టీ అధినాయకులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలసి ఆయన నిర్ణయం మేరకు ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ వైఎస్ఆర్సిపి అభ్యర్థిగానే పోటీ చేస్తానని ఇందులో ఎటువంటి అనుమానాలు, సందేహాలు అవసరం లేదని ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఒకరిపై అసత్య ట్రోలింగ్ ప్రచారం చేసేముందు కొంచెం విజ్ఞతతో ఆలోచించడం మంచిదని ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి సూచించారు.

# బాలీవుడ్ బిగ్గెస్టాబ్లాక్బస్టర్ గదర్ 2 వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా ఈ ఆదివారం సాయంత్రం 5:30 గంటలకుమీ జీ తెలుగులో!




**ఒంగోలు,కలంకౌంటర్ :** తెలుగు ఎంటర్టైన్మెంట్ ఇండస్ట్రీలో అత్యంత ఆదరణ పొందిన ఛానళ్లలో ఒకటైన జీ తెలుగు తన ప్రేక్షకులను అలరించేందుకు అందివచ్చిన ప్రతిఅవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటోంది. వారం వారం సరికొత్త సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న జీ తెలుగు మరో బ్లాక్బస్టర్ హిట్ని ఈ ఆదివారం కానుకగా అందించనుంది. 2023లో బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించిన గదర్2ని వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా తెలుగులో ప్రసారం చేయనుంది. ఎమోషనల్ ఎంటర్టైనర్ గదర్ 2, ఫిబ్రవరి 18 ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు, మీ జీ తెలుగులో!తెలుగు ప్రేక్షకులుఎంతగానో ఎదురుచూస్తున్న గదర్ 2 సినిమాను తెలుగు వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా ప్రసారంచేయనుంది. అనిల్ శర్మ దర్శకత్వంలో 2001లో వచ్చిన బ్లాక్ బస్టర్ 'గదర్: ఏక్ ప్రేమ్ కథ'కు సీక్వెల్గా ఈ సినిమా తెరకెక్కింది. బాలీవుడ్ స్టార్యాక్టర్స్ సన్నీ డియోల్, అమీషా పటేల్, ఉత్కర్ష్ శర్మ నటించిన ఈ చిత్రం 1971 ఇండో–పాకిస్థాన్ యుద్ధంలో తారా సింగ్ (సన్నీ డియోల్)ప్రయాణమే ప్రధాన ఇతివృత్తంగా తెరకెక్కింది. జైలులో ఉన్న తన కుమారుడు చరణ్జీత్సింగ్ (ఉత్కర్ష్ శర్మ) ను రక్షించడానికి పాకిస్థాన్ నుంచి తిరిగివచ్చిన తారా సింగ్ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాడు అనేది ఈ సినిమా కథ.థియేట్రికల్ రిలీజ్సక్సెస్ తర్వాత ఫిబ్రవరి 18న సాయంత్రం 5:30 గంటలకు జీ తెలుగులో ప్రసారం కానున్న 'గదర్ 2' ప్రేక్షకులకు అదిరిపోయే వినోదాన్ని పంచడానికి సిద్ధమైంది.కాబట్టి,తెలుగు ప్రీమియర్గా ప్రసారం కానున్నబాలీవుడ్ బ్లాక్ బస్టర్ సినిమా గదర్ 2ని జీ తెలుగు వేదికగా ఈ వారాంతంలో మీరూ మిస్సవకుండావీక్షించండి!

# తమ ప్రభుత్వం వస్తే చేనేత సమస్యలను పరిష్కరిస్తాం

● బూరగడ్డ వేదవ్యాస్ వెల్లడి






**పెడన,కలంకౌంటర్ :** టిడిపి జనసేన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఉపసభాపతి బూరగడ్డ వేదవ్యాస్ హామీ ఇచ్చారు. గూడూరు మండలంలోని ఐదుగుళ్లపల్లి చేనేత సహకార సంఘాన్ని ఆయన మంగళవారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా చేనేత సొసైటీల తీరు తెన్నులను ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో చేనేత సొసైటీలు తీవ్రంగా నష్టపోయాయి అని అన్నారు. కార్మికులకు అందవలసిన పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వం నిలిపి వేసిందని ఆరోపించారు. తమ ఉమ్మడి ప్రభుత్వం రాగానే చేనేత సమస్యలకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనాధ ఆశ్రమం,వృద్ధాశ్రమం, మానసిక దివ్యాంగుల ఆశ్రమాలలో రవ్వా శ్రీనివాసులు పుట్టినరోజు వేడుకలు



**కందుకూరు,కలంకౌంటర్ :** ఆకలితో ఉన్న వారి ఆకలిని తీరుద్దాం వాళ్ళ కళ్ళల్లో ఆనందాన్ని చూద్దాం అనే నినాదంతోమానవ సేవే మాధవ సేవ అంటూ...... నిరంతరం పేదవారి అవసరాలను తీర్చే దిశగా శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ(8341221414) కందుకూరు వారి అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సేవాహృదయ రవ్వా శ్రీనివాసులు పుట్టిన రోజు సందర్భంగా వారి సహకారంతో విజయనగరంలోని ప్రేమ వెలుగు అనాధ ఆశ్రమంలోని పిల్లలకు, మధిర ఆదరణ అనాధ వృద్ధాశ్రమంలో ఉన్నవారికి, గుంటూరు లోని డంపింగ్ యార్డ్ లో ఉన్న వారికి, గుంటూరు కె.బి.ఆర్ అనాధ ఆశ్రమంలోని పిల్లలకు నూతన వస్త్రాలు, ఆహారం పంపిణీ చేశారు. కందుకూరు పట్టణం కోవూరు రోడ్ లో ఉన్న స్వర్ణ స్వయంకృషి మానసిక వికలాంగుల పాఠశాల లో పిల్లలకు సాయంత్రం అల్పాహారం పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో శ్రీరామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు, వాసవి క్లబ్ లెజండ్స్ ప్రెసిడెంట్ రవ్వా శ్రీనివాసులు పాల్గొన్నారు.

# జి వి ఎస్ ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా శ్రీ పంచమి వేడుకలు



**ఉలవపాడు,కలంకౌంటర్ :** జి వి ఎస్ ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నాడు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఎల్ సుధారాణి అధ్యక్షతన శ్రీ పంచమి వేడుకలు నిర్వహించారు.కళాశాల ఆవరణంలో ఎర్రజొన్న సుబ్బారావు రికార్డ్ అసిస్టెంట్ రిటైర్డ్ నెలకొల్పిన సరస్వతి దేవి విగ్రహం కు విద్యార్థిని విద్యార్థులు భక్తి శ్రద్దలతో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ చదువుల తల్లి సరస్వతి దేవిని పూజించారు. ఈ కార్యక్రమంలోకళాశాల సిబ్బంది విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.



వాసవి శాంతిధాం పెనుగొండ నందు ద్వారకా తిరుమల శ్రీ పద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణము.

–పెనుగొండ,కలంకౌంటర్ :



శ్రీ వాసవి శాంతి ధామ్ క్షేత్రము లో శ్రీ నగరేశ్వర స్వామి వారికి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా రజత ముఖ కవచ సమర్పణ

–పెనుగొండ,కలంకౌంటర్ :



పెనుగొండ శ్రీ వాసవి అమ్మవారిని దర్శించుకున్న శ్రీ శ్రీ శ్రీ వామనాశ్రమ స్వామీజీ (హల్దిపూర్ మఠం )( కర్ణాటక)

–పెనుగొండ,కలంకౌంటర్ :

# నూతన వదువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి



**కందుకూరు,కలంకౌంటర్ :** కావలి దొడ్ల మనోహర్ రెడ్డి వారి కళ్యాణ మంటపం లో చాకిచర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకులు మిరియం శ్రీనివాసులుబిసుమతి ల కుమార్తె రేవతి– మాధవ సుధీర్ ల వివాహానికి హాజరై నూతన వదువరులను ఆశీర్వదించిన కందుకూరు శాసన సభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు పాల్గొన్నారు.

# అన్న ప్రసాద భవనానికి రూ 1,00,116/-లు విరాళం



**కందుకూరు,కలంకౌంటర్ :** పట్టణం లో కనిగిరి రోడ్ నందు ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి గుడి వెనక భాగంలో నూతనంగా నిర్మిస్తున్న అన్న ప్రసాద వితరణ భవనముకు కందుకూరు వాస్తవ్యులు దివి.కొండయ్య చౌదరి మనవడు దివి.ప్రణీత్ చౌదరి జ్ఞాపకార్థం వారి తల్లి దండ్రులు దివి. రవి శేఖర్ ధర్మపత్ని రమణమ్మ అన్నప్రసాద వితరణ భవన నిర్మాణం కొరకు రూ?. 100, 116/- విరాళము అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ అయ్యప్ప సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ అన్న ప్రసాద భవనానికి విరాళం అందజేసిన వారికి వారి కుటుంబ సభ్యులకు శ్రీ అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని వారు అన్నారు.ఈకార్యక్రమంలో శ్రీ అయ్యప్ప సేవా సంఘం కమిటీ సభ్యులు కే .ఎస్ .వెంకటేశ్వర్లు(గురుస్వామి) ఇస్కాల.వెంకట నరసింహ, నల్లబోతుల.మురళి, మాదాలవెంకటేశ్వర్లు, కాటా.చెంచురామయ్య, దాసరి.శ్రీనివాసులు, ఉన్నం.వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అవకతవకలను ఉపేక్షించించం అంబుడ్స్ పర్సన్ - కర్లపాటి



**గుడ్లవల్లేరు (కృష్ణా జిల్లా),కలంకౌంటర్ :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేజ్ స్పీకర్స్ కు సకాలంలో కూలీ చెల్లించవలసిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిదేనని కృష్ణాజిల్లా అంబుడ్స్ పర్సన్ కర్లపాటి వెంకట శ్రీనివాసరావు అన్నారు. బుధవారం గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా తనిఖీలో పాల్గొని పథకం అమలు తీరని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలులో వేజ్ సికర్స్ కు ఏమైనా ఇబ్బందులు ఉన్నా, ఏదైనా అవినీతి జరిగితే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఏ స్థాయిలో అవకతవకలకు పాల్పడిన చర్యలు తప్పవని అన్నారు. పథకం అమలులో లోపాలు ఉన్నా , వేతన దారులకు నష్టం కలిగిన తన దృష్టికి 78937 55 794 , 9154022922 తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం పలు మండలాల్లో జరుగుతున్నా ఉపాధి హామీ పనులను పరిశీలించారు. పథకం అమలు, వేతన చెల్లింపులు, వారి హక్కులపై వేతనదారులతో అయన సమీక్షించారు

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వసంత పంచమి సందర్భంగా నోట్ బుక్స్, పలకలు పంపిణీ





**కారంపూడి( పల్నాడు జిల్లా),కలంకౌంటర్ :** కారంపూడి మండలంలోని దివ్య సాయి స్కూల్ వెనుక గల బాలచంద్ర నగర్ లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో వసంత పంచమి పురస్కరించుకొని కారంపూడి వాసవి క్లబ్, పేటసన్నెగండ్ల ఎంపీటీసీ గాడిపర్తి పూర్ణయ్య రమాదేవి చింతపల్లి మాజీ సర్పంచ్ ఉన్నంశ్రీనివాసరావు వారి ఆధ్వర్యంలో నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లు ,పలకలు పిల్లలందరికి అందించి మొదటి తరగతి పిల్లలకు ఓంకారంతో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించి పలకలు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు. పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్టిక్ అడిషనల్ గవర్నర్ భవిరిశెట్టి రామారావు కారంపూడి వాసవి క్లబ్బు అధ్యక్షులు కర్నాటి నరసింహారావు పేట సన్నీ గండ్ల ఎంపిటిసి గాడిపర్తి పూర్ణయ్య రమాదేవి చింతపల్లి మాజీ సర్పంచ్ ఉన్నం శ్రీనివాసరావు ఎంపీపీ స్కూల్ హెచ్ఎం కే. రాఘవరావు ఉపాధ్యాయులు పి. శివశంకరరావు ఎం. శ్రీరాములు, మహిళ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు

## సత్యనారాయణ సింగ్ సేవలు చిరస్మరణీయం



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పూర్వ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.సత్యనారాయణ సింగ్ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం జిల్లా సంఘ భవనంలో సత్యనారాయణ సింగ్ సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘానికి సత్యనారాయణ సింగ్ ఎనలేని సేవలు అందించారన్నారు. సంఘ పటిష్టతకు ఆయన చేసిన కృషి నిరుపమానమన్నారు. అనంతరం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్, జిల్లా కోశాధికారి ఏ శంకరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బికే దుర్గారావు, యల్ వెంకటేశ్వరరావు, ఎం సత్యనారాయణ, సిహెచ్ ప్రమీల, కంచనపల్లి కృష్ణ మోహనరావు, రాజమండ్రి గౌతమీ నేత్రాలయం వైద్య బృందం, విజయవాడ దుహిత డెంటల్ కేర్ వైద్య బృందం పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఉచిత వైద్య శిబిరంలో నేత్ర పరీక్షల దంత పరీక్షలు నిర్వహించారు.



కృష్ణాజిల్లా, మోపిదేవి మండలం, మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవంలో వినియోగించే భూచక్ర గొడుగులు, తెర సేల్లాలను ఆలయ ప్రధాన అర్చకులు బుద్దు పవన్ కుమార్ శర్మ సోదరులు మరియు ఆలయ వేద పండితులు నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వనాధికారి యన్ .యస్ . చక్రధరరావు గారికి అందజేసినారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు బుద్ధి పవన్ కుమార్ శర్మ ఆలయ అర్చకులు బుద్దు సతీష్ శర్మ పాల్గొన్నారు.

–మోపిదేవి,కలంకౌంటర్ :

## అచ్చంపేట ఏ ఎం సీ చైర్మన్ అరుణ పై జరిగిన దాడి అనాగరిక చర్య

● ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ

**విజయవాడ,కలంకౌంటర్ :** సభ్య సమాజం తలదించుకునేలా మహిళలు ఉన్నత రంగంలో రాణించడానికి జీర్ణించుకోలేని కొందరు మూర్ఖులు, అచ్చంపేటను కౌరవ సభగా మార్చి ఒక మహిళను మరో మహిళతో చీర లాగించి పైశాచిక ఆనందం పొందిన పశువుల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ,మహాసభ గౌరవధ్యక్షులు జయంతి వెంకటేశ్వర్లు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కొప్పురావూరి రజని,పొలిటికల్ విభాగం వైస్ చైర్మన్ పడుచూరి వెంకటేశ్వర్లు తెలిపారు. భారతదేశంలో భరతమాతను దైవంగా కొలుస్తున్న సమాజం మనదని ఈ సంఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నదన్నారు , ఈ దుర్ఘటనకు పాల్పడిన రాబందులపై తెలంగాణ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు , మహిళ ఆత్మ గౌరవాన్ని, కించపరిచి మహిళపై దాడి చేయించిన పశువులను, దాడి చేసిన వ్యక్తులను, తక్షణమే అరెస్టు చేసి ఆమె ఆత్మ గౌరవం కాపాడాలని డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాదాలు నివారణకు దృష్టి




**తిరువూరు,కలంకౌంటర్ :** తిరువూరు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించారు. తిరువూరు పట్టణం తో పాటు గ్రామీణ రహదారులలో వాహనాల తనిఖీ చేస్తూ బుధవారం జీ కొత్తూరులో ఆటోవాలాలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకున్నా చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఇన్స్పైర్ మనా క్ అవార్డుకు సెయింట్ జాన్స్ విద్యార్థులు





**బంటుమిల్లి,కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రభుత్వం 2023– 24 సంవత్సరానికి గాను ప్రకటించిన ఇన్స్పైర్ మనాక్ అవార్డుకు బంటుమిల్లి సెయింట్ జాన్స్ విద్యార్థి ఎంపికయ్యాడు. బుధవారం పాఠశాల డైరెక్టర్ సాబుజాన్ ప్రిన్సిపాల్ ఝాన్సీ సాబూ లు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇన్స్పైర్ అవార్డుకు పాఠశాలలకు చెందిన 9వ తరగతి విద్యార్థి నున్న భాగ్యోధయ్ ప్రతిపాదించిన జిప్ ఫిక్షన్ మిషన్ అవార్డుకు ఎంపికైనట్లు వారు తెలిపారు ఈ ప్రాజెక్టు తయారీకి విద్యార్థి భాగ్యోధయ్ కు ప్రభుత్వం 10000 రూపాయలునగదు ప్రోత్సాహకం అందిస్తుందని వారుతెలిపారు.అలాగే గతయేడాది ఇన్స్పైర్ మునాక్ అవార్డుకు ఎంపికైన విద్యార్థిని దాసరిమేఘన తయారు చేసినడబుల్ సెక్యూరిటీ బ్యాకింగ్ సిస్టం ప్రాజెక్ట్ ను బుదవారం విజయవాడ లోజిల్లా స్థా యిలోజరిగిన యెగ్జిభిషన్ లో ప్రదర్శించిన ట్లు సాబు జాన్,ఝాన్సీ సాబు లు తెలిపారు. ఈ అవార్డుకు ఎంపికైన విద్యార్థిని పలువురు అభినందించారు.


## ప్రభుత్వం ఉద్యోగులకు రావలసిన బకాయిలు వెంటనే చెల్లించాలని నిరసన




**కందుకూరు,కలంకౌంటర్ :** రాష్ట్ర ఉద్యోగ జేఏసీ పిలుపుమేరకు ఉద్యోగులకు రావలసిన అన్ని బకాయిలు వెంటనే చెల్లించాలని, అందరు ఉద్యోగులకు మధ్యంతర భృతి ఈ నెల నుంచే వర్తింపజేయాలని జేబులకు నల్ల రిబ్బున్లు ధరించి స్థానిక బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల బోధనేతర సిబ్బంది నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో చలంచర్ల సుబ్బారావు,షేక్ రషీద్,వి. బోస్,కె. అంజి రెడ్డి, ఎం మధు కృష్ణ,పి.మాధవయ్య, షేక్.మీరా సాహెబ్,మహిళా ప్రతినిది గంగోలు ప్రసన్న తదితరులు పాల్గొని నిరసన తెలియజేశారు.

## భగవద్గీత ఫౌండేషన్ ను సందర్శించిన శ్రీరామ స్వామి





**హైదరాబాద్, కలంకౌంటర్ :** ప్రసిద్ధ ఆధ్యాత్మిక గురువు, నిస్వార్ధ, నిష్కామ కర్మయోగి శ్రీరామ స్వామి (శ్రీరామ్ సర్) 'భగవద్గీతా ఫౌండేషన్' కార్యాలయం లో కాసేపు గడిపారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు, గీతా గాన ప్రవచన ప్రచార కర్త డా॥ ఎల్ వి గంగాధర శాస్త్రి, ఫౌండేషన్ అడ్వొకేసీ ఛీఫ్ ఆజాద్ బాబు వారిని స్వాగతించారు. అదే సమయం లో ఫౌండేషన్ లోకి తన తల్లిదండ్రులతో చి॥ అచ్యుత్ శర్మ అడుగు పెట్టాడు. తాను నేర్చుకున్న భగవద్గీత లోని శ్లోకాలు, పోతన భాగవతం పద్యాలు స్పష్టమైన ఉచ్చారణతో వినిపించి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసాడు. ఇదంతా అతని పూర్వజన్మాభ్యాస ప్రభావమేనని, అతని తల్లి తండ్రుల సుకృతమని గంగాధర శాస్త్రి అన్నారు. ఆజాద్ బాబు, గీతా గురువు శ్రీమతి శైలజ, వేదమాతరం పత్రిక సంపాదకులు శ్రీ విశ్వనాథ శోభనాద్రి సమక్షంలో శ్రీ రామ్ స్వామి ఆనందభరితుడై అచ్యుత్ శర్మను ఆశీర్వదించారు.

## శేష వాహనంపై మోపిదేవి స్వామి వారు..





**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణ ఉత్సవాల సందర్భంగా స్వామివారు మోపిదేవి మరియు రావివారిపాలెం గ్రామం వరకు ఊరేగింపుగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కొబ్బరికాయలు పూలు హారతులతో స్వామివారికి అందించారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్ శర్మ , విరూపు కుమార్ శర్మ, మరియు దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన టిడిపి కార్యాలయ ప్రారంభోత్సవ వేడుకలు



**గుడివాడ,కలంకౌంటర్ :** గుడివాడ ఏలూరు రోడ్డులో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మరియు ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించిన టిడిపి ఇంచార్జ్ వెనిగండ్ల రాము. వేలాదిగా పాల్గొన్న టిడిపి శ్రేణులు. మిఠాయిలు తినిపిస్తూ రాముకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర రావు, టిడిపి–జనసేన పార్టీల నాయకులు. పార్టీ కార్యాలయానికి ప్రజా దర్బార్ గా నామకరణం చేస్తూ–గుడివాడ ప్రజలకు అంకితం చేసిన రాము

## ఆలయ శంకుస్థాపన కార్యక్రమం లో బండి



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** గూడూరు మండలం కోక నారాయణ పాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్చార్జి బండి రామకృష్ణ ఆలయ చైర్మన్ శ్రీ వీరనాల నాంచారయ్య, చందన కోటేశ్వరావు, చోడగం శ్రీనివాసరావులు బండి రామకృష్ణ కు దేవాలయ నిర్మాణం గూర్చి వివరించి అనంతరం సన్మానించారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గూడూరు మండల అధ్యక్షుడు దాసరి ఉమాసాయిరాం,చోడగం వినాయక్,శాయనసురేష్, మచిలీపట్నం జనసేన పార్టీ నాయకులు గడ్డంరాజు, వంపు గడవలచౌదరి,కూనపురెడ్డి ప్రసాద్, మోకారవి,ఈవనమణిబాబు,గంపలకృష్ణ, కొండిశెట్టిహర్ష, విన్నకోటశ్రీకాంత్, కర్ర రామకృష్ణ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## విద్య కుటుంబ వ్యవస్థను మార్చేస్తుంది - ఎమ్మెల్యే మహిధర్ రెడ్డి




**ఉలవపాడు,కలంకౌంటర్ :** కలంకౌంటర్, విద్య కుటుంబ వ్యవస్థనే మార్చేస్తుందని మహిళ రెడ్డి అన్నారు. మండలంలోని పెద్ద పట్టపు పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వార్షికోత్సవం లో ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు మానుగుంట మహిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థితికి వెళ్ళాలని అన్నారు. చదువు కుటుంబ వ్యవస్థను మార్చేస్తుందని అన్నారు. విద్యార్థులు ఎంత కష్టపడి చదివితే అంత ఉన్నత స్థితికి ఎదుగుతారని తద్వారా మీ తల్లిదండ్రులకు సంఘంలో గౌరవ మర్యాదలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ ప్రారంభించిన నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** నగర పాలక సంస్థ పరిధిలోని 18 వ డివిజన్, 40 వ డివిజన్ లో నిర్వహించిన రెండో విడత 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైద్యాధికారులు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఆమె పలురకాల వైద్య పరీక్షల కోసం వచ్చిన వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ ,డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి ,పట్టణ అధ్యక్షులు షైక్ సిలర్ దాదా ,18 వ డివిజన్ కోర్పొరేటర్ మేకల సుబ్బన్న ,40వ డివిజన్ ఇంచార్జ్ రంగా , కార్పొరేటర్లు మిరియాల బసవపూర్ణమ్మ ,రాసంశెట్టి వాణి శ్రీ,మరీదు రటలమ్మ ,కో ఆప్షన్ సభ్యులు మట్టా తులసమ్మ ,బేతపూడి రవి ,మునిసిపల్ కమిషనర్ బాపిరాజు వైద్య అధికారులు,మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు

# మల్లాయిపాలెం అవులియా బాబా దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే కొడాలి నాని

**గుడివాడ,కలంకౌంటర్ :** రూరల్ మండలం మల్లాయిపాలెంలో బుధవారం ఎమ్మెల్యే కొడాలి నాని పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సయ్యద్ హజరత్ షాలర్ షా ఔలియా బాబా దర్గాలో బాబావారిని ఎమ్మెల్యే నాని దర్శించుకున్నారు. తొలుత పవిత్ర గంధం,చాదర్ లను శిరస్సుపై ఉంచుకొని మైనార్టీ పెద్దలతో కలిసి ఎమ్మెల్యే కొడాలి నాని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మత గురువులతో కలిసి బాబా వారికి గంధం , చాదర్ ను సమర్పించారు. ఈ సందర్భంగా మత గురువులు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే కొడాలి నాని, మైనార్టీ పెద్దలు పాల్గొన్నారు. మండలంలో విశిష్టత కలిగిన అవులియ బాబా దర్గాను దర్శించుకోవడం సంతోషకరమని ఎమ్మెల్యే కొడాలి నాని హర్షం వ్యక్తం చేశారు. బాబా వారి ఆశీస్సులు సీఎం జగన్, వైసిపి ప్రభుత్వం, రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే నాని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు మట్టా జాన్ విక్టర్,వైసిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశి భూషణ్,



వైఎస్ఆర్సిపి నాయకులు మురారి నగేష్, పాలేటి చంటి, షేక్ బాజీ, షేక్ సయ్యద్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షాకీర్, ఎండి గులాబ్, ఘంటా సురేష్,తాజుద్దిన్, షమ్ము, గ్రామస్తులు, మైనార్టీ పెద్దలు పాల్గొన్నారు.




## పలు కార్యక్రమాల్లో పేర్ని కిట్టు

-మచిలీపట్నం, కలంకౌంటర్ :




# వైసీపీలో భారీగా చేరికలు

● మంత్రి కారుమూరి సమక్షమంలో 100 చేరిక





**తణుకు(ఇరగవరం మండలం, రేలంగి),కలంకౌంటర్ :** ప్రభుత్వ పాలన మెచ్చి టీడీపీ, జనసేన నుంచి భారీ సంఖ్యంలో కార్యకర్తలు వైఎస్సార్సీపీలో చేరుతున్నారని రాష్ట్ర పౌర సరఫరాల మరియు వినియోగదారులు శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. తణుకు నియోజకవర్గం, ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో బుధవారం మంత్రి సమక్షంలో జనసేన, టీడీపీలకు చెందిన 100 మంది కార్యకర్తలు వైఎస్సార్సీపీలో చేరగా, వీరిని మంత్రి కారుమూరి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు ఆకర్షితులవుతున్నారని, వారు వైసీపీ పార్టీలో చేరుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఘనవిజయానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. చదువుల రాష్ట్రంగా మార్చేసిన ఘనుడు సీఎం జగన్మోహన్ రెడ్డి, గత ప్రభుత్వంలో 16వ స్థానంలో ఉన్న విద్యను ఈ ప్రభుత్వంలో దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి తీసుకువచ్చిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. ఈ సీఎం విద్య, వైద్యం, ఆరోగ్యానిక పెద్ద పీట వేసారన్నారు. నాడు-నేడు పథకం ద్వారా రాష్ట్రంలో పాఠశాలలను విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులై ఉండాలని మంచి సంకల్పంతో చదువులకు పెద్దపీట వేశారన్నారు. గత ప్రభుత్వ పాలకులు వాళ్ల కులస్తులకే సంక్షేమాన్ని అందించగా ఈ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజల అందరికీ సంక్షేమం అందాలని చెప్పిన దేశంలోనే గొప్ప వ్యక్తి సీఎం జగన్ అని అన్నారు. మనస్సులో ఎటువంటి కల్మషం లేకుండా ప్రతీ పేదవాడు సంతోషంగా జీవించాలన్న తపనతో సీఎం స్వచ్ఛమైన పాలన అందిస్తున్నారని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక సీఎం జగన్మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా డీబీటీ రూపంలో లబ్దిదారుల ఖాతాలో నేరుగా నగదు జమ చేయడంతో ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందాయన్నారు. మీ ఇంటిలో జగనన్న ప్రభుత్వం వచ్చాక మీకు మేలు జరిగితేనే రానున్న ఎన్నికలలో వైఎస్సార్సీపీకి ఓటు వేయండిని అని దమ్ము, ధైర్యంగా చెప్పిన ఏకైక వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ఈ ప్రభుత్వంపై పచ్చమీడియా, ప్రతిపక్షపార్టీలు ఏకమై అసత్యప్రచారాలు చేస్తున్నాయని, వాటిని ప్రజలు నమ్మవద్దన్నారు. మీఇళ్లకు రెండు కండువాలు కప్పుకుని ఓట్లు అడగడాని మీ తలుపులు తడతారని వాళ్ల నేరపూరిత మాటలు నమ్మవద్దని, మీరు అంతా మీకు మేలు జరిగే ప్రభుత్వానికే ఓటు వేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో రేలంగి ఉపసర్పంచ్ పులుపు అక్కమాంబ, రేలంగి పార్టీ అధ్యక్షులు పులుపు అనీల్, రేలంగి ఎంపిటీసీ మొట్ల కిరణ్మయి, రేలంగి సొసైటీ అధ్యక్షులు నడిపల్లి రాంబాబు రాజు, వైసీపీ నాయకులు, గాదిరాజు బుజ్జి, వడ్డి మార్కండేయులు, యూత్ ఉపాధ్యక్షుడు వీరమల్లు ఫణీంద్ర, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# జై భారత్ పార్టీ సాంగ్స్ రిలీజ్


● అనంత శ్రీరామ్ లిరిక్స్, చంద్రలేఖ మ్యూజిక్ సూపర్ హిట్ ● రెండు ఉద్యమ పాటల్నివిడుదల చేసిన జైభారత్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ● జనజన జనజన జైభారత్ అన్న అనంత శ్రీరామ్ ● ప్రజలే రాజులుగా మన జైభారత్ పార్టీ అనే రెండో పాట

**విజయవాడ,కలంకౌంటర్ :** జనాల్ని కదిలించే రెండు ఉద్యమ పాటల్ని జై భారత్ నేషనల్ పార్టీ బుధవారం సాయంత్రం రిలీజ్ చేసింది. జన జన జనజన జైభారత్, జీవన స్రవంతికి జైభారత్ అంటూ, ప్రముఖ పాటల రచయిత అనంత శ్రీరామ్ సాహిత్యంతో, చంద్రలేఖ మ్యూజిక్ తో విడుదల చేసిన తొలి సాంగ్ అందరినీ అమితంగా ఆకట్టుకుంటోంది. దీనితో పాటు ప్రజలే రాజులుగా మన జైభారత్ పార్టీ అనే రెండు పాటలను పార్టీ అధ్యక్షుడు వి.వి.లక్ష్మీనారాయణ బుధవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. జన సముద్ర జైభారత్ నినదిస్తోంది నింగిని చీల్చుకుని అనే పాటను సింహా పాడారు. ప్రజలే రాజులుగా మన జైభారత్ పార్టీ అనే రెండో పాటను కవిశేఖర మనశ్రీ సాహిత్యం, చంద్రలేఖ సంగీతం, బల్లేపల్లి మోహన్ గాత్రం అందించారు. ఈ రెండు పాటలను పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి పోతిన వెంకట రామారావు, నాయుడు శిరీషా రాణి విడుదల చేయగా, పార్టీ నాయకులు కొడాలి ఏకాంబరం, ఆకురాతి వెంకట అశ్వని, కవిత, తదితరులు పాల్గొన్నారు.




# ప్రజా చైతన్యానికి అక్షరమే ఆయుధం : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు

● నీరుకొండ ప్రసాద్ రాసిన 'అక్షరాస్త్రం' పుస్తకావిష్కరణ



**అమరావతి,కలంకౌంటర్ :** ప్రజాచైతన్యానికి అక్షరమే ఆయుధంగా నిలవాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజా సమస్యలను వ్యాసాల రూపంలో వెలుగులోకి తీసుకొస్తూ సీనియర్ జర్నలిస్ట్ నీరుకొండ ప్రసాద్ రాసిన 'అక్షరాస్త్రం' పుస్తకాన్ని బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఏపీలో మీడియాపై ఆంక్షలు విధిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న మీడియా సంస్థలు, జర్నలిస్టులపై అక్రమ కేసులతో వేధిస్తున్నారన్నారు. నీరుకొండ ప్రసాద్ రాసిన అక్షరాస్త్రం పుస్తకం ప్రజలను ఆలోచింపచేసేలా ఉందన్నారు. వైసీపీ నేతల అరాచాకలు, అక్రమాలను వెలుగులోకి తెస్తూ ప్రసాద్ ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు

**తిరువూరు,కలంకౌంటర్ :** తిరువూరు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది బుధవారం 0-5 సంవత్సరాల చిన్నారులు, గర్భిణీ స్త్రీలకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. పట్టణంలోని పలు వార్డు సచివాలయాల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు తట్టు, కంఠసర్పి, కోరింత దగ్గు, పోలియో, మెదడువాపు, నిమోనియా వంటి వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా టీకాలు వేసినట్లు యూ పీ హెచ్ సీ వైద్యాధికారి డాక్టర్ భాను మనోజ్ తెలిపారు. హెల్త్ సూపర్ వైజర్ లు కే రవి, షేక్ ఆశాబీ పర్యవేక్షణలో సచివాలయం వార్డు హెల్త్ సెక్రెటరీ లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



# వైవీ సుబ్బారెడ్డి నోట సీఎం జగన్ మాట: అచ్చెన్నాయుడు

**అమరావతి,కలంకౌంటర్ :** వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి నోట సీఎం జగన్ మాట వచ్చిందని.. బినామీ ఆస్తులు కాపాడుకోవడానికే మళ్లీ హైదరాబాద్ పాట పాడుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. హైదరాబాద్‌లోని బినామీ ఆస్తుల కోసమే కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. గతంలో అమరావతి నిర్మాణానికి కనీసం 30 వేల ఎకరాలుండాలని, ఇక్కడే ఇల్లు కట్టుకుంటానని జగన్ చెప్పినట్లు అచ్చెన్న గుర్తు చేశారు. అమరావతిని పూర్తి చేస్తామని ప్రజలను నమ్మించిన జగన్.. అధికారంలోకి రాగానే రాజధానిని సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేశారని మండిపడ్డారు. జగన్.. మూడు రాజధానుల పేరుతో మూడు ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టారు. ఈ మూడు ప్రాంతాల్లో బినామీ ఆస్తులు పోగేసుకున్నారు. హైదరాబాద్ పేరుతో నాలుగో ముక్క తెరపైకి తీసుకొచ్చారు. కేవలం బినామీ ఆస్తులను కాపాడుకోవడం కోసమే ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారు. జగన్ రెడ్డి అరాచకం స్థాయి 'రాజధాని ఫైల్స్' సినిమా చూస్తే అర్థమవుతుంది. 60 రోజుల తర్వాత తెదేపా-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. అమరావతిని పూర్తి చేస్తాం.. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసి చూపిస్తాం. రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలుపుతాం" అని అచ్చెన్నాయుడు ధీమా వ్యక్తం చేశారు.




Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com